క్లుప్తంగా

మాజీ కౌన్సిలర్‌పై ఫిర్యాదు

మెట్‌పల్లి: పట్టణంలోని అర్బన్ హౌసింగ్‌కాలనీకి చెందిన వృద్ధుడు ఖాజామోహినుద్దీన్ గురువారం మాజీ కౌన్సిలర్ షాకీర్‌పై డీఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఓ విషయంలో షాకీర్ తనను చంపుతానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకొని తనను కాపాడాలని విజ్ఞప్తి చేశాడు.

పరామర్శ

కథలాపూర్: సిరికొండలో మాజీ సర్పంచ్ సంక మాధురిని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు గురువారం పరామర్శించారు. మాధురి భర్త రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. రాజేందర్ పార్టీకి అందించిన సేవలను గుర్తు చేశారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్, అజయ్‌రావు, మల్యాల మారుతి, కాసోజీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

మెట్‌పల్లిరూరల్: సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మెట్‌పల్లి మండల వ్యవసాయాధికారి షాహిద్‌అలీ తెలిపారు. జగ్గాసాగర్ డీసీఎంఎస్, మెట్లచిట్టాపూర్ ఆగ్రోస్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో జగ్గాసాగర్, మెట్లచిట్టాపూర్ రైతు వేదిక కేంద్రాల్లో, మెట్‌పల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో పర్మిట్ పొందొచ్చని చెప్పారు. విత్తనాల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

రైతులకు విత్తనాలు అందించడంలో విఫలం

రాయికల్: రైతులకు విత్తనాలు అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జోగినిపల్లి తిరుపతిగౌడ్ ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. నాయకులు సింగిరెడ్డి రాంరెడ్డి, రాజిరెడ్డి, మోహన్‌రావు, మల్లేశం, రాజన్న, పడాల సత్యం, ఆరె బుచ్చన్న పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలి



దావన్‌పెల్లిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రాయికల్: విత్తన కొనుగోళ్లలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ అన్నారు. గురువారం వస్తాపూర్, ఆల్యానాయక్‌తండా, కట్కాపూర్, దావన్‌పల్లి గ్రామాల్లో విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీలర్ల నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, విత్తనాల ప్యాకెట్‌పై కంపెనీ పేరు, బ్యాచ్ నంబరు, తయారీ తేదీ చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈవోలు పద్మావతి, రాజేశ్, మతాయి ఉన్నారు.

రేపటి లోగా ప్రవేశం పొందాలి

మల్యాల: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో తెలంగాణ గురుకుల కళాశాలల్లో ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులు జూన్ 1 లోగా ఆయా కళాశాలల్లో ప్రవేశం పొందాలని గురుకుల కళాశాలల కన్వీనర్ పత్తెం శ్రీనివాస్ తెలిపారు. రెండో జాబితాలో సీట్లు పొందిన అభ్యర్థులకు ఇప్పటికే సమాచారమందించామని, తాటిపల్లి, పెద్దాపూర్, మేడారం గురుకుల కళాశాలల్లో సర్టిఫికెట్లు అందజేసి అడ్మిషన్ తీసుకోవాలన్నారు.

సౌకర్యాలు మెరుగుపరిచేందుకే ‘అమ్మ ఆదర్శ పాఠశాల’

మేడిపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లక్ష్యమే అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమమని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో చిరంజీవి, ఎంఈవో నరేశం అన్నారు. ఉమ్మడి మండలానికి 34 యునిట్లు మంజూరైనట్లు తెలిపారు. సుమారు రూ.4.8కోట్లు మంజూరైనట్లు చెప్పారు. పాఠశాలల మౌలిక వసతులైన తాగునీరు, కరెంట్ సమస్యలు, తరగతి గదుల ఆధునికీకరణ, మరుగుదొడ్ల వసతి, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం వంటి సౌకర్యాలు మెరుగుపరచి పాఠశాలలు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా 8మంది పర్యవేక్షక అధికారులను నిధులు పక్కదోవ పట్టకుండా నియమించినట్లు చెప్పారు. జూన్ 12న తరగతులు పునఃప్రారంభం కానుండగా.. ఆదర్శ పాఠశాల సౌకార్యాలు అంతలోపు పూర్తి చేస్తారా అని విద్యార్థుల తల్లిదండ్రులు చర్చించుకుంటున్నారు.

బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శంకర్

మెట్‌పల్లి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన బొమ్మెల శంకర్‌ను నియమించారు. నియామక పత్రాన్ని గురువారం హైదరాబాద్‌లో జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆయనకు అందజేశారు. జిల్లా నాయకులు నల్ల వెంకటేశ్వర్లు, మాచర్ల సదానందం తదితరులున్నారు.

గుడిపేట.. సౌకర్యాలు ఏడా..?



గుడిపేట గ్రామానికి వెళ్లే రోడ్డు



గుడిపేట గ్రామం

- కానరాని మౌలిక వసతులు
- రోడ్డు లేదు.. రేషన్ దుకాణం లేదు
- అసంపూర్తిగా శ్మశాన వాటిక

మల్యాల: గ్రామ పంచాయతీ ఏర్పడిందనే సంతోషమే గాని.. ఏళ్లు గడుస్తున్నా గ్రామ పంచాయతీకి ప్రత్యేక నిధుల్లేవు. మౌలిక వసతుల కల్పనకూ నోచుకోలేదు. మల్యాల మేజర్ గ్రామ పంచాయతీలో 15వ వార్డుగా ఉన్న గుడిపేట గ్రామాన్ని 2017లో నూతన గ్రామ పంచాయతీగా చేయొద్దని మల్యాల గ్రామ పంచాయతీ తీర్మానం చేసినా.. గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. నూతన గ్రామ పంచాయతీలో ఏళ్లుగా మౌలిక వసతుల కల్పనను గాలికి వదిలేశారు. గుడిపేట గ్రామంలో 366 మంది ఓటర్లుండగా, సుమారు 600 వరకు జనాభా ఉంది. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవమైతే ప్రభుత్వం నుంచి ప్రత్యేక గ్రాంటు కింద రూ.10లక్షలు వస్తాయని గ్రామస్తులందరూ రాజకీయాలకతీతంగా గత సర్పంచ్ ఎన్నికల్లో గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మౌలిక వసతులు కరువు

మల్యాల మేజర్ గ్రామ పంచాయతీ నుంచి విడివడి గుడిపేట గ్రామం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడినా.. మౌలిక వసతుల కల్పనకు నోచుకోలేదు. మల్యాల మేజర్ గ్రామ పంచాయతీని ఆనుకున్న ఉన్న గుడిపేట గ్రామానికి వెళ్లేందుకు కంకర రోడ్డే దిక్కయింది. మల్యాల ఎస్సీ కాలనీ నుంచి గుడిపేటకు వెళ్లే దారి గుంతలు, కంకర రాళ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా కొండగట్టు హనుమాన్ జయంతికి పాదయాత్రగా వెళ్లే స్వాములు ఈ గుంతల రోడ్డు వెంట వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న గ్రామ పంచాయతీ కావడంతో ప్రజలు నూరుశాతం పన్నులు చెల్లించినా ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులను కూడా నియమించుకోలేని దుస్థితిలో పారిశుద్ధ్య కార్మికుడు ఒక్కరే పని చేస్తున్నారు. ఏళ్ల తరబడి గ్రామానికి వెళ్లే దారిలో తారు వేయాలనే గ్రామస్తుల విన్నపం అరణ్య రోదనగానే మిగిలింది.

రేషన్ దుకాణం లేక తిప్పలు

గుడిపేట గ్రామ పంచాయతీగా ఏర్పడినా.. గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ప్రతినెలా బియ్యం కోసం మల్యాలకు వెళ్లి తీసుకురావడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో కాయాకష్టం చేసుకుంటూ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న నిరుపేదలే కావడంతో.. రేషన్ బియ్యం కోసం ఒకరోజు కూలి వదులుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నా.. రవాణా కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

అసంపూర్తిగా..

గుడిపేట గ్రామానికి ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో శ్మశాన వాటికను సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో వరద కాలువ సమీపంలో నిర్మాణం చేపట్టాల్సి వచ్చింది. అసంపూర్తి నిర్మాణాలతో శ్మశాన వాటికకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. చెరువు కట్ట సమీపంలోనే దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు.

పాఠశాల భవనం కూల్చి..

పంచాయతీకి భవనం లేక పాఠశాల భవనంలోనే నిర్వహించారు. ప్రస్తుతం పాఠశాల భవనం కూల్చి అదే స్థలంలో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణం చేపడుతున్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు విద్య సైతం అందకుండా పోతోంది. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతోంది. గుడిపేట గ్రామంలో ఇంగ్లిష్ మీడియంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి



గుడిపేట పంచాయతీగా ఏర్పడినా మౌలిక వసతులు కల్పించలేదు. కనీసం రేషన్ దుకాణం కూడా ఏర్పాటు చేయకపోవడంతో వృద్ధులు, మహిళలు బియ్యం తీసుకొని రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినెలా గుడిపేటలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలి. శాశ్వతంగా రేషన్ దుకాణం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. **– ఇట్టిరెడ్డి అంజిరెడ్డి, గుడిపేట**

మహిళా సంఘ భవనం నిర్మించాలి



గ్రామంలో మహిళా సంఘ భవనం లేకపోవడంతో ప్రతి నెలా మహిళా సంఘం సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం సైతం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతోంది. నిధులు మంజూరు చేసి మహిళా సంఘ భవనం, అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మించాలి. **– గొట్టె అనిత, గుడిపేట**



అపూర్వ సమ్మేళనం

మల్లాపూర్: స్థానిక జెడ్పీ పాఠశాలలో 2006–07లో 10వతరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా స్థానిక కేఎంఆర్ గార్డెన్‌లో గురువారం అపూర్వ సమ్మేళనం జరుపుకున్నారు. తుమ్మనపెల్లి విష్ణు, మేడి వినోద్, ముత్యాల రమేశ్, లవంగ శివకుమార్, ఎగ్యారపు శ్రీనివాస్, ఇ.రాజు, దేవ సునీల్, ముత్యాల రాజశేఖర్, బేతపు వినోద్, చింత మౌనిక, తోట ఉమ, అర్చన, నిరోష తదితరులు పాల్గొన్నారు.

కల్తీ పెట్రోల్ అమ్ముతున్నారని ఫిర్యాదు

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్‌లో గురువారం కల్తీ పెట్రోల్ కలకలం సృష్టించింది. బాధితుడి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల గంగరాజం స్థానిక పెట్రోల్ బంకులో ఉదయం తన బైక్‌లో పెట్రోల్ పోయించుకొని 500 మీటర్ల దూరం వెళ్లగా.. బైక్ ఆగిపోయింది. ఎన్నిసార్లు ప్రయత్నించినా బైక్ స్టార్ట్ కాకపోవడంతో.. స్థానికంగా ఓ మెకానిక్‌కి చూపించాడు. ముందుగా వాహనం నుంచి పైపు ద్వారా పెట్రోల్‌ను తీసి పరిశీలించి చూడగా.. పూర్తిగా నీళ్లమయంగా కనిపించింది. దీంతో బాధితుడు సదరు పెట్రోల్ బంకుకి వెళ్లి ప్రశ్నించగా.. నీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకో అంటూ దురుసుగా సమాధానమిచ్చారు. దీంతో కల్తీ పెట్రోల్ బాటిల్‌తో సహా తహసీల్ కార్యాలయానికి వెళ్లి సదరు పెట్రోల్ బంకుపై ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.



కల్తీ పెట్రోల్ బాటిల్ చూపుతున్న గంగరాజం

అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి గెస్ట్ లెక్చరర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,654 మంది పని చేస్తున్నారని, జగిత్యాల జిల్లాలో 56 మంది కళాశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారని, చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. స్పందించిన జీవన్‌రెడ్డి వెంటనే బోర్డు కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరారు. 1145 అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు గుర్రాల సాయికృష్ణ, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ప్రవీణ్, ఇఫ్తేకార్, రాజ్‌కుమార్, శంకరయ్య, శిరీష పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చెరువులు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రం శివారుల్లోని పలు చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని, వెంటనే హద్దులు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ బీర్‌పూర్ గ్రామానికి చెందిన యువ చైతన్య యూత్ సభ్యులు తహసీల్దార్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 92లో ఉన్న మంగలికుంట, సర్వే నంబర్ 111లోని ఊరకుంట, సర్వే నంబర్ 205లోని మర్రికుంట, సర్వే నంబర్ 170లోని దేవుని చెరువు, సర్వే నంబర్ 32లోని అంకమ్మకుంట ఆక్రమణకు గురవుతున్నాయన్నారు.

రైతు సమస్యలు ప్రభుత్వానికి పట్టవా..

మల్లాపూర్: రైతు సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ మండల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాల కోసం రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. బీజేపీ జిల్లా కార్యదర్శి లక్ష్మీ, మండల ఉపాధ్యక్షుడు శివకుమార్, పట్టణ అధ్యక్షుడు అశ్విన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాగరాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల కార్యవర్గ సభ్యుడు రాములు, సీనియర్ నాయకుడు రాజారాం, బూత్ అధ్యక్షుడు హన్మాండ్లు, రాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల(చొప్పదండి): ఉమ్మడి జిల్లాలోని తాటిపల్లి బాలికల, పెద్దపూర్ బాలుర గురుకులం కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ శ్రీనివాస్ తెలిపారు. పెద్దపూర్, తాటిపల్లి కళాశాలల్లో సంస్కృతం-2 పోస్టులు, గణిత శాస్త్రం-2,భౌతిక శాస్త్రం-2, రసాయన శాస్త్రం-2, జంతుశాస్త్రం-2, వృక్షశాస్త్రం -2 పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీతోపాటు బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీజీటీ సంస్కృతం-1, హిందీ-1, ఆంగ్లం-1, గణితం-1, బయోసైన్స్-2, సోషల్-1, పీజీటీ గణితం-2, పీజీటీ సోషల్-1, పీఈటీ-1 పోస్టులకు బోధన అనుభవంతోపాటు, తరగతి గది బోధన పరిశీలన ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. జూన్ 6లోగా ప్రిన్సిపల్, తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలకు దరఖాస్తులు పంపాలని, principal.tsrs.thatipally@gmail.com ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బోధనలో అనుభవం తోపాటు ఉన్నత చదువుల అర్హత ఉన్నవారికి ప్రాధాన్యముంటుందని, షార్ట్ లిస్ట్ చేసి డెమో క్లాసల ద్వారా ఎంపిక చేస్తామని వివరించారు.

గీత కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాం



కాలిపోయిన ఈత వనాన్ని పరిశీలిస్తున్న విప్ అడ్లూరి

బుగ్గారం: సిరికొండ గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పెద్ద సంఖ్యలో ఈత చెట్లు కాలిపోగా.. వాటిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న గీత కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి కాలిపోయిన చెట్లను పరిశీలించారు. స్థానిక గీత కార్మికులతో మాట్లాడుతూ నష్టపోయిన గౌడ కులస్తులకు ప్రభుత్వపరంగా పరిహారమందేలా కృషి చేస్తానని అన్నారు. జెడ్పీటీసీ రాజేందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేముల సుభాష్, స్థానిక నాయకులు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న విప్

ధర్మపురి: రాయపట్నం గ్రామంలో అభయాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో గురువారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ముందుగా వేద పండితులు మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు చేశారు. తాజా మాజీ సర్పంచ్ చిన్నక్క, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ముగిసిన డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్

ధర్మపురి: పది రోజుల నుంచి నిర్వహిస్తున్న డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం సాయంత్రం ముగిసింది. ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హిందూసేనా ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భార్గవ్ 11 జట్టు విజయం సాధించగా.. రంజిత్ 11 జట్టు రన్నర్‌గా నిలిచింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతకు రూ.8వేలు, రన్నర్ జట్టుకు రూ.6వేలు విప్ చేతుల మీదుగా అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ఎస్.దినేష్, వేముల రాజు, చిలుముల లక్ష్మణ్, టోర్నీ నిర్వాహకులు లక్ష్మణ్, అప్పం తిరుపతి, బాకి అనిల్ తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

జగిత్యాల: పొరండ్ల గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ కృష్ణతేజ మాట్లాడుతూ.. పేదలు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని, పరీక్షలు చేసి ఉచితంగా మందులిస్తామన్నారు. గురువారం 60 మంది వయోవృద్ధులు, వికలాంగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. మొబైల్ మెడికేటర్ యూనిట్ సభ్యులు గణేశ్‌రాథోడ్, లావణ్య, ఆశ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



పనులు పరిశీలిస్తున్న జ్యోతి

జగిత్యాల: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. పట్టణంలోని పలు డ్రెయినేజీలను పరిశీలించి పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. శానిటేషన్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి డ్రెయినేజీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కౌన్సిలర్ రజినికాంత్ పాల్గొన్నారు.



ఉప్పుమడుగులో..

ఘనంగా పోచమ్మ బోనాలు

సారంగాపూర్: పెంబట్ల గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం పోచమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. బెజ్జంకి రమేశ్, మొదిగం శేఖర్, మంగళిపెల్లి లచ్చన్న తదితరులున్నారు.

రాయికల్: ఉప్పుమడుగు, కట్కాపూర్ గ్రామాల్లో గురువారం వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కోరుట్ల: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో రూ.50లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు పట్టణానికి చెందిన కాసు క్రాంతికుమార్–పావనలక్ష్మీ రూ.51వేల విరాళాన్ని గురువారం అందించారు. ఇప్పటివరకు రూ.8.18లక్షల విరాళాలు సమకూరినట్టు ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. కార్యదర్శి తోట రాజు, కోశాధికారి జుంబర్తి రమేశ్, ఉపాధ్యక్షులు గట్ల ఆనంద్, నిమిషకవి నాగరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న దాతలు

అవకతవకలపై చర్యలు తీసుకోండి

జగిత్యాల: సర్వే నంబరు 1599లో 722 మున్సిపల్ ఆఫీసు రికార్డులో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ దివాకరకు మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ఫిర్యాదు చేశారు. తప్పుడు సమాచారమిచ్చి తప్పుదోవ పట్టించిన వారిపై క్రిమినల్ కేసు పెట్టాలని, ఒకవేళ మున్సిపల్ అధికారుల ప్రమేయం ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల ఇళ్ల వద్దకు అధ్యాపకులు

సారంగాపూర్: సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం తీసుకోవాలని గురువారం రేచపల్లి గ్రామంలో కళాశాల అధ్యాపకులు విస్తృతంగా పర్యటించారు. సారంగాపూర్ జూనియర్ కళాశాలలో 12 సంవత్సరాలుగా సాధిస్తున్న ఫలితాలను వివరిస్తూ జిల్లాలో అత్యుత్తమ కళాశాల అని, సొంత భవనాలు, పూర్తిస్థాయిలో అన్ని సబ్జెక్టులకు బోధనా అధ్యాపకులు, అధునాతన సైన్స్ ల్యాబ్స్, లైబ్రేరి ఉన్నాయని వివరించారు. పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు సుజాత, సతీష్, నాగేశ్వరి, రజిత, రాజేందర్, రాజు, వెంకటేశ్వర్లు, సౌజన్య, రాజ్‌కుమార్ తదితరులున్నారు.



రేచపల్లిలో ప్రచారం చేస్తున్న సారంగాపూర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు

ఇండియన్ ఆర్మీ టెక్నికల్‌లో కోరుట్ల యువకుడి సత్తా

కోరుట్లరూరల్: ఇండియన్ ఆర్మీ ప్రకటించిన టెక్నికల్, జీడీ ఫలితాల్లో కోరుట్లకు చెందిన మహమ్మద్ అనాస్ అనే యువకుడు సత్తా చాటాడు. తెలంగాణలో 25 మంది యువకులు అర్హత పొందగా.. అందులో మహమ్మద్ అనాస్ టెక్నికల్ విభాగంలో ఎంపికయ్యాడు. అనాస్ తండ్రి రఫీ కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.



మహమ్మద్ అనాస్

మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు

ధర్మపురి/మల్లాపూర్/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/వెల్గటూర్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు జన్మదినాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ధర్మపురిలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనృసింహస్వామికి పూజలు చేశారు. నంది కూడలి వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మల్లాపూర్ మండల కేంద్రంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సత్యంరెడ్డి, పీసీసీ ఫిషర్మన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు. పెగడపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు, చాట్ల విజయభాస్కర్, టౌన్ ప్రెసిడెంట్ ప్రశాంత్, యూత్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.